

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.72,570
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.6,517
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.85,900
రిటైల్ వెండి గ్రాము	రూ.87.90

క్లుప్తంగా

ఇసుక అక్రమ రవాణాకు అడ్డు



ఎగువరెడ్డివారిపల్లి శ్మశాన వాటిక వద్ద ట్రెంచ్

చంద్రగిరి: స్వర్ణముఖి నదీ పరివాహక ప్రాంతాల్లో అక్రమ ఇసుక రవాణాను గ్రామస్తులు కట్టడి చేసిన ఘటన శుక్రవారం మండల పరిధిలోని రెడ్డివారిపల్లి పంచాయతీలో చోటు చేసుకుంది. గత కొద్ది రోజులుగా ఎగువరెడ్డివారిపల్లి శ్మశాన వాటిక నుంచి కొంత మంది అక్రమంగా ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ క్రమంలో గ్రామస్తులంతా కలసి అక్రమ ఇసుక రవాణాను కట్టడి చేయాలని నిర్ణయించారు. దీంతో శ్మశాన వాటిక చుట్టూ జేసీబీ సాయంతో ఇసుక తరలించకుండా ట్రెంచ్ ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ శ్మశానంలో సైతం అక్రమార్కులు ఇసుకను తవ్వేస్తున్నారని, దీంతో పూర్వీకుల సమాధులు ధ్వంసమవుతున్నాయంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయడానికి ఇలా ట్రెంచ్ ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు.

భరణం చెల్లించని భర్తకు జైలు

తిరుపతి లీగల్: కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం భార్యకు భరణం చెల్లించనందుకు గోపవరం ఉదయ భాస్కర్ రెడ్డిని 2నెలలపాటు జైలుకు తరలించాలని తిరుపతి ఐదో అదనపు జిల్లా జడ్జి(ఫ్యామిలీ కోర్టు) రామ్ గోపాల్ తీర్పు చెప్పారు. వివరాలు.. ఉదయ భాస్కర్ రెడ్డి భార్య చంద్రకళ తిరుపతి ఫ్యామిలీ కోర్టులో 2018లో దాఖలు చేసిన కేసు పూర్వాపరాలు పరిశీలించిన కోర్టు అతను నెలకు రూ.4వేలు భరణం ఆమెకు చెల్లించాలని 2022 జనవరి 3వ తేదీన తీర్పు చెప్పారు. అయితే ఆమెకు భరణం చెల్లించకపోవడంతో ఆమె తిరిగి కోర్టును ఆశ్రయించింది. తన భర్త మొత్తంగా రూ.2.26 లక్షలు భరణం కింద చెల్లించేటట్టు ఆదేశాలివ్వాలని పిటీషన్‌లో కోరారు. న్యాయమూర్తి విచారించి భార్యకు భరణం చెల్లించని ఉదయభాస్కర్‌రెడ్డిని రెండు నెలలపాటు సివిల్ జైలుకు తరలించాలని తీర్పులో పేర్కొన్నారు.

మిడ్ డే మీల్స్ మిథ్యేనా!

'టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నాణ్యమైన మధ్యాహ్న భోజన పథకం అమలు చేసి తీరుతాం... ఇంటర్ విద్యలో హాజరు శాతం పెంచేందుకు 2024–25 విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే పథకాన్ని ప్రారంభిస్తాం... విద్యార్థులు క్యారీ బ్యాగులు మోసుకుని రావాల్సిన పనిలేదు. కాలేజీలల్లో నాణ్యమైన భోజనం అందించడమే లక్ష్యంగా మెనూ తయారు చేస్తాం' ఇదీ నారా లోకేష్ యువగళం పాదయాత్రలో యువతకు ఇచ్చిన ప్రధాన హామీ.

జూనియర్ కళాశాలలు ప్రారంభమై దాదాపు మూడు నెలలు కావస్తున్నా పథకం అమలు మాటే ఎత్తడం లేదు. యువగళం వెలవెలబోతున్న సందర్భంలో యువతను ఆకట్టుకునేందుకు అమలుకు నోచుకోని హామీలను గుప్పించారు. అనుకూలమైన కళాశాలల్లో విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి యువత తమవైపే ఉన్నారని చూపించారు. ఈ పాదయాత్రలో పలు మార్లు మిడ్ డే మీల్స్‌పై హామీలు ఇచ్చారు. ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని ఇప్పటికే విద్యార్థి సంఘాల నాయకులు కలెక్టర్‌ను కలసి వినతి పత్రం అందజేశారు. తక్షణం పథకాన్ని అమలు చేయని పక్షంలో కళాశాలల బంద్‌కు పిలుపునిచ్చి, ధర్నాలు, నిరసనలు చేపడుతామని తిరుపతి జిల్లా విద్యార్థి సంఘాల ఐక్యవేదిక నాయకులు హెచ్చరిస్తున్నారు.

– తిరుపతి సిటీ

- కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ఊసేది?
- కాలేజీలు ప్రారంభమై మూడు నెలలు కావస్తున్నా అమలుకు నోచుకోని వైనం
- యువగళం.. ప్రగల్భాలేనా..
- అమలు చేయకపోతే నిలదీస్తామంటున్న విద్యార్థి సంఘాలు



జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకాన్ని అమలు చేయాలని కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

తిరుపతి జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలు	–	20
టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న జూనియర్ కళాశాలలు	–	4
ఫస్టియర్‌లో చేరిన విద్యార్థులు	–	31,655
రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు	–	28,790
మొత్తం విద్యార్థుల సంఖ్య	–	60,445

కళాశాలల బంద్‌కు పిలుపునిస్తాం



యువగళం పాదయాత్రలో లోకేష్ జూనియర్ కళాశాలలో మిడ్ డే మీల్స్ పథకాన్ని తిరిగి అమలు చేస్తామని విద్యార్థులకు మాట ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ ఏడాది నుంచి నాణ్యమైన ఆహారాన్ని అందిస్తామన్నారు. కళాశాలలు ప్రారంభమై సుమారు 3 నెలలు పూర్తవుతోంది. కానీ మధ్యాహ్న భోజన పథకంపై నోరు మెదపడం లేదు. విద్యార్థులు ఆకలి కేకలతో అలమటిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి కళాశాలకు వచ్చే పేద విద్యార్థుల పరిస్థితి వర్ణనాతీతం. కొందరు క్యారీలు తెచ్చుకునే స్థోమత లేని విద్యార్థులు ఆకలి చదువులు చదువుతున్నారు. పస్తులు ఉంటూ కళాశాలలకు రాలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా విద్యాశాఖా మంత్రి నారాలోకేష్ ఇచ్చిన మాటను వెంటనే నిలబెట్టుకోవాలి. లేని పక్షంలో ధర్నాలు, నిరసనలు పెద్ద ఎత్తున చేస్తాం. **-ప్రవీణ్ కుమార్, ఏఐఎస్ఎఫ్, జిల్లా కార్యదర్శి, తిరుపతి**

యువగళం మూగబోయిందా?



నారాలోకేష్ యువగళం ప్రగల్భాలు ఏమయ్యాయి. అధికారం చేపట్టగానే యువగళం మూగబోయిందా... మధ్యాహ్న భోజన పథకాన్ని జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు అందిస్తాం అని పాదయాత్రలో హామీ ఇచ్చారు. కళాశాలలకు పూర్వ వైభవం తెస్తామంటూ యువతను మభ్యపెట్టారు. కళాశాలలు ప్రారంభమై 90 రోజులు కావస్తోంది. పథకం అమలుపై దిశానిర్దేశం చేయలేదు. కనీసం ఎప్పటి నుంచి అమలు చేస్తారనే మాట సైతం మాట్లడకపోవడం దారుణం. తక్షణం పథకాన్ని ప్రతి ప్రభుత్వ కళాశాలలో అమలు చేసి తీరాల్సిందే. ఆలస్యం చేస్తే ఐక్య విద్యార్థి సంఘాలతో కలిసి పోరాడుతాం.

- రవి, ఎస్ఎఫ్ఐ, జిల్లా కార్యదర్శి, తిరుపతి

తక్షణం అమలు చేయాలి



మిడ్ డే మీల్స్ పథకం తక్షణం అమలు చేసి తీరాల్సిందే. జిల్లాలో ఇంటర్ చదువుతున్న సుమారు 60వేల మంది విద్యార్థులు పథకం అమలు కోసం ఎదురుచూస్తున్నారు. భోజనం క్యారీలు తీసుకురాకండి... ప్రభుత్వమే ప్రతి ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తామంటూ మంత్రి లోకేష్ చెప్పిన మాట నిలబెట్టుకోవాలి. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణంలోని కళాశాలలకు వచ్చే విద్యార్థులకు భోజన వసతి కల్పించాలి. ఇప్పటికే కాలేజీలు ప్రారంభమయ్యాయి. ఇంతవరకు ప్రభుత్వం పథకాన్ని అమలు చేయకపోవడం దారుణం.

- ఆర్.ఆశా, పీడీఎస్ఓ, జిల్లా కార్యదర్శి, తిరుపతి

నిరుపేద విద్యార్థులకూ శఠగోపం



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలు గడుస్తోంది. సూపర్‌సిక్స్ అంటూ నిరుద్యోగులను, యువతను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చింది. చెప్పిన ఒక్క హామీని కూడా ఇంతవరకు ప్రారంభించకపోవడం దారుణం. ప్రభుత్వ ఇంటర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తామని నిరుపేద విద్యార్థులకు శఠగోపం పెట్టారు. కళాశాలలు ప్రారంభమైనా మాట వరుసకైనా విద్యాశాఖ మంత్రి నోరుమెదపక పోవడం దారుణం. వేలాది మంది విద్యార్థులు పట్టెడన్నం కోసం ఎదురు చూస్తున్నారు. మానవత్వంతోనైనా పథకాన్ని అమలు చేసి తీరాలి. లేకుం విద్యార్థులతో కలసి ధర్నాలు, నిరసనలు తప్పవు.

- జె.మల్లికార్జున, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తిరుపతి

విద్యార్థుల ఆగ్రహానికి గురికావద్దు



యువగళం పాదయాత్రలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మిడ్‌డే మీల్స్ అందిస్తామని విద్యార్థులకు హామీ ఇచ్చిన లోకేష్ బాబు మాట తప్పారు. ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేక బడ్జెట్ లేదని, ఆర్థికంగా రాష్ట్రం ఇబ్బందులు ఎదుర్కొంటోందంటూ మాయ మాటలు చెబుతున్నారు. హామీలు గుప్పించే సమయంలో బడ్జెట్ విషయం గుర్తుకు రాలేదా? పేద విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడటం మంచి పద్ధతి కాదు. తక్షణం పథకాన్ని అమలు చేసి తీరాలి. లేకుంటే అన్ని విద్యార్థి సంఘాలు కలసి ఉద్యమిస్తాం. ప్రభుత్వం విద్యార్థుల ఆగ్రహానికి గురికాక ముందే పథకం అమలు చేయాలి.

- కె.ఆది, పీడీఎస్‌యూ, జిల్లా కార్యదర్శి, తిరుపతి

బ్యాంకులో దొంగతనానికి యత్నం

- వెస్ట్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు



బ్యాంకులో పరిశీలిస్తున్న ఏఎస్పీ కులశేఖర్

తిరుపతి క్రైమ్: బాలాజీ కాలనీలో ఉన్న యూనియన్ బ్యాంకులో దొంగతనానికి ప్రయత్నించిన సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. తిరుపతి జిల్లా లా అండ్ ఆర్డర్ ఏఎస్పీ కులశేఖర్ ఘటన స్థలానికి చేరుకొని పూర్తిస్థాయిలో పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. బాలాజీ కాలనీలోని యూనియన్ బ్యాంకులో గుర్తు తెలియని వ్యక్తి 12 గంటల 50 నిమిషాల సమయంలో చోరీ చేసేందుకు వచ్చాడన్నారు. దుండగుడు సీసీ కెమెరాలు కనిపించకుండా బెడ్ షీట్ కప్పుకుని బ్యాంకులోని ఆఫీస్ రూములోని కిటికీ గ్రిల్‌ను పెద్ద కట్టర్‌తో కట్ చేసి లోపలికి ప్రవేశించాడని తెలిపారు. రెండు గంటలపాటు స్ట్రాంగ్ రూమ్ తాళాల కోసం వెతికి ఎంతకూ దొరక్కపోవడంతో వచ్చిన దారి నుంచే పారిపోయాడన్నారు. ఇదంతా కూడా సీసీ కెమెరాలో రికార్డ్ అయినట్టుగా తెలిపారు. గుర్తుపట్టలేనంతగా ముసుగు వేసుకొని లోపలికి ప్రవేశించాడని తెలిపారు.

దుండగుడు ముందుగా రెక్కీ నిర్వహించే దొంగతనానికి పాల్పడి ఉండొచ్చని భావిస్తున్నామన్నారు. దుండగుడు కిటికీ గ్రిల్ తొలగించి వెళ్లే సమయంలో కాటన్ వేసి వెళ్లడంతో గమనించలేకపోయారు. క్లీనింగ్ చేసే సమయంలో పనివారు గుర్తించి మేనేజర్‌కు చెప్పడంతో విషయం బయటపడిందన్నారు. దీనిపై బ్యాంకు చీఫ్ మేనేజర్ సబరేశ్ దేవ్ జరిగిన విషయాన్ని వారి హెడ్ ఆఫీస్‌కి సమాచారం అందించారు. సాయంత్రం సమయంలో ఘటనపై వెస్ట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని దుండగుడి వేలిముద్రలు సేకరించారు. త్వరలోనే నిందితుడిని అరెస్ట్ చేస్తామని ఏఎస్పీ తెలిపారు.

వేడుకగా జెండా పండుగ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: 78వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఈ నెల 15వ తేదీన వేడుకగా నిర్వహిద్దామని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలో శుక్రవారం జెండా ఉత్సవం సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై జేసీ శుభం బన్సల్, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ నారుపురెడ్డి మౌర్య, డీఆర్‌ఓ పెంచల కిషోర్, ఇతర అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తిరుపతి నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లను తిరుపతి ఆర్డీవో నిషాంత్‌రెడ్డి పర్యవేక్షించాలని తెలిపారు. అలాగే బందోబస్తు, జెండా వందనం, వేదిక అలంకరణను, కవాతు ఏర్పాట్లను పోలీస్ శాఖ, తుడా వారు సమన్వయంతో చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమానికి వచ్చేవారి కోసం సీటింగ్ ఏర్పాట్లను అర్బన్ తహశీల్దార్, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమ నిర్వహణ డీఈఓ శేఖర్ చూడాలని వెల్లడించారు. ప్రథమ చికిత్స కేంద్రం, అత్యవసర వైద్య సేవల ఏర్పాట్లను డీఎంఅండ్ హెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి చూడాలని, పారిశుధ్యం, తాగునీటి వసతి ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్‌తోపాటు గ్రామీణ నీటి సరఫరా ఎస్ఈ విజయకుమార్ చేపట్టాలని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలపై స్టాల్స్, శకటాలను వివిధ శాఖలు ఏర్పాటు చేయాలని, జిల్లాలోని పలు శాఖలు సాధించిన ప్రగతి నివేదిక తయారీ, పబ్లిక్ అడ్రస్ సిస్టంను సమాచార శాఖ పర్యవేక్షించాలని వివరించారు.

ఈ-పంట నమోదు చేసుకోండి

తిరుపతి రూరల్: ప్రతి రైతు తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు పిలుపునిచ్చారు. తిరుపతి రూరల్ మండలం సీగొల్లపల్లిలోని రైతు సేవా కేంద్రం వద్ద జరగుతున్న ఈ-పంట నమోదు గ్రామసభకు ఆయన హాజరయ్యారు. ఈ-పంట నమోదు ఆవశ్యకత, ఉపయోగాలను రైతులకు వివరించారు. కౌలు రైతు తప్పనిసరిగా కౌలుదారు సర్టిఫికెట్‌ను తీసుకోవాలన్నారు. భూమి యాజమానితోపాటు కౌలు రైతుకు కూడా అన్నదాత సుఖీభవ వర్తిస్తుందన్నారు. ఈ సర్టిఫికెట్‌తో బ్యాంకులో రుణాలు కూడా ఇస్తున్నారని, కౌలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ మనోహర్, మండల వ్యవసాయాధికారి సంగన మమత, హరిత, ప్రేమలత, రైతులు పాల్గొన్నారు.

మండుటెండలో మోకాళ్ల దండన



మోకాళ్లపై కూర్చున్న విద్యార్థులు

రేణిగుంట: రేణిగుంట–తిరుపతి మార్గం ఫ్లైఓవర్ వంతెన సమీపంలో ఉన్న శ్రీవెంకటేశ్వర ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో శుక్రవారం విద్యార్థులు హోంవర్క్ రాయలేదన్న కారణంగా పాఠశాల ప్రాంగణంలో ఆరుబయట మోకాళ్లపై కూర్చోబెట్టిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పాఠశాలలోని వివిధ క్లాసులకు చెందిన 40 మంది విద్యార్థులు హోంవర్క్ రాయలేదన్న నెపంతో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు, పీఈటీ కలసి విద్యార్థులను క్లాస్ రూము నుంచి బయటకు తీసుకొచ్చి ఆరుబయట ఎండలో మోకాళ్లపై కూర్చోబెట్టారు. అక్కడే వారితో హోంవర్క్ రాయించి క్రమశిక్షణ పేరుతో పైశాచికం ప్రదర్శించారు. మీడియావారు స్కూల్ వద్దకు వెళ్లి వీడియోలు తీయడంతో వారిని స్కూల్ సిబ్బంది అడ్డుకున్నారు. వాగ్వాదం చోటుచేసుకోవడంతో గాజులమండ్యం పోలీసులు చేరుకుని మీడియా వారికి సర్దిచెప్పి పంపారు. విషయం తెలుసుకున్న డీఈవో శేఖర్ వెంటనే రేణిగుంటలోని స్కూల్ వద్దకు చేరుకుని, విచారించారు. పిల్లలను వేర్వేరుగా పిలిచి మాట్లాడారు. విద్యార్థులను హింసించిన ఇద్దరు ఉపాధ్యాయులను పాఠశాల నుంచి తొలగించారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే మరింత కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

ఉద్యాన రైతుల కలెక్షన్ సెంటర్ తనిఖీ

చంద్రగిరి: ఐతేపల్లె, భీమవరంలోని శ్రీ లక్ష్మీకృష్ణ ఉద్యాన ఉత్పత్తిదారుల రైతు సంఘానికి చెందిన కలెక్షన్ సెంటర్లను జిల్లా ఉద్యాన అధికారి దశరథరామిరెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మామిడిలో కొమ్మ కత్తిరింపుల అనంతరం పొలంలో లోతు దుక్కులు చేసుకోవాలన్నారు. పదేళ్ల పైబడిన చెట్లకు 100 కేజీలు పశువుల ఎరువు, 5 కేజీలు సింగిల్ సూపర్ ఫాస్పేట్, 2 కేజీలు యూరియా, 1.5 కేజీల పొటాష్ ఎరువులను వాడుకోవాలని తెలిపారు. పదేళ్లలోపు వయసు గల మామిడి తోటలలో జనుము, జీలుగ, పిల్లి పెసర వంటి పచ్చిరొట్ట ఎరువులను ఎకరాకు 10-15 కేజీలు చల్లుకోవాలని సూచించారు. పూత వచ్చే ముందు దశలో పొలంలో కలియ దున్నుకోవాలన్నారు.దీంతో భూమిలో కర్బన శాతం పెరుగుతుందని, మొక్కకు రోగ నిరోధక శక్తి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి మండల ఉద్యాన అధికారి ఎస్.శైలజ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఆయాపై మందుబాబుల దాడి



దాడి చేస్తున్న మందుబాబులు

నాయుడుపేట టౌన్: నాయుడుపేట పట్టణంలోని ఓ అంగన్‌వాడీ కేంద్రం వద్ద శుక్రవారం సాయంత్రం మందుబాబులు వీరంగం సృష్టించారు. అంగన్‌వాడీ కేంద్రం వద్ద మద్యం తాగి వచ్చిన యువకులను ప్రశ్నించినందుకు అంగన్‌వాడీ ఆయాను దూషిస్తూ మూకుమ్మడిగా దాడిచేశారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం సాయంత్రం జైహింద్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం వద్దకు పట్టణానికి చెందిన మునీంద్ర, శంకర్, హరికృష్ణ మద్యం మత్తులో వచ్చారు. దీంతో వారిని అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా కవిత వారిని నిలదీశారు. మద్యం మత్తులో ఉన్న యువకులు ఆమెను పరుష పదజాలంతో దూషించారు. అంతే కాకుండా ఆమెపై దాడి చేసి గాయపరిచారు. ఈ సంఘటనతో సమీపంలో ఉన్న అంగన్‌వాడీ ఆయా భర్త పోలయ్య, సోదరి వెంకటరమణమ్మ అడ్డునేందుకు వెళ్లారు. వారిపై కూడా దాడి చేసినట్లు బాధితులు పేర్కొన్నారు. గాయపడిన వారిని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

కారుణ్య నియామకం



నియామకపత్రం అందిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి క్రైమ్ : హోంగార్డు మోహన్ అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన సతీమణి కవితకు కారుణ్య నియామకం కింద ఉద్యోగం కేటాయిస్తూ ఎస్పీ సుబ్బరాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం ఈ మేరకు నియామక పత్రాన్ని ఆమెకు అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ వెంకటరావు పాల్గొన్నారు.

బళ్లారి రాఘవకు ఘన నివాళి

తిరుపతి కల్చరల్ : తెలుగు నాటక రంగ కీర్తిని చాటిన నటుడు, దర్శకుడు బళ్లారి రాఘవకు రాయలసీమ రంగస్థలి కళాకారులు శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. శుక్రవారం తిరుపతిలోని రంగస్థలి కార్యాలయంలో బళ్లారి రాఘవ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో గుండాల గోపీనాథ్‌రెడ్డి, కేస్ రాజా, సుబ్రమణ్యం, శాంబోలు హరినాథ్, కస్పా పద్మనాభం పాల్గొన్నారు.

యాప్‌ల భారం తగ్గించాలని డిమాండ్

రామచంద్రాపురం: ఉపాధ్యాయులకు బోధనేతర యాప్‌ల పని భారం తగ్గించాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్నాథం డిమాండ్ చేశఋారు. శుక్రవారం మండలంలోని పాఠశాలల్లో సమస్యల సేకరణ, సభ్యత్వ స్వీకరణ చేపట్టారు. ఎస్టీయూ తిరుపతి డివిజన్ కన్వీనర్ వాసు మాట్లాడుతూ అమ్మకు వందనం పథకాన్ని ప్రభుత్వ బడులకు మాత్రమే వర్తింపజేయాలని సూచించారు. ఎస్టీయూ నేతలు వరప్రసాద్, జగన్‌మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు, రమాదేవి పాల్గొన్నారు.

మత్తు వినియోగంపై అవగాహనకు వినతి

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీలో విద్యార్థినులకు మత్తు పదార్థాల వినియోగం –అనర్థాలపై అవగాహన కల్పించాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. శుక్రవారం ఈమేరకు వీసీ ఉమకు వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ విద్యార్థినుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని వర్సిటీలో అసాంఘిక చర్యలను కట్టడి చేయాలని సూచించారు. ఎస్టీయూ వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు మన్నం ప్రేమ్‌కుమార్, దళిత విద్యార్థి సేన నాయకుడు కొండ యుగంధర్, బీడీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జేడీ ప్రసాద్, మహేంద్రనాయక్, రూకేష్, ముని, నరేష్ పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ పోస్టర్ల ఆవిష్కరణ

తిరుపతి అర్బన్: ఏపీ ఓపెన్ స్కూల్‌లో పదో తరగతి, ఇంటర్మీడియట్ అడ్మిషన్లకు ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్ పోస్టర్‌ను కలెక్టర్ వెంకటేశ్వర్, డీఈఓ శేఖర్ ఆవిష్కరించారు. శుక్రవారం డీఈవో మాట్లాడుతూ వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీవోపీఈఎస్‌స్కూల్.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ సందర్శించాలని కోరారు.

ముగిసిన 'కెరీర్ గైడెన్స్'


తిరుపతి సిటీ: శ్రీపద్మావతి మహిళా వర్సిటీ ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్, స్టూడెంట్స్ అఫైర్స్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో వర్సిటీలో నాలుగు రోజులుగా జరిగిన విద్యార్థినుల కెరీర్ గైడెన్స్ ప్రోగ్రాం శుక్రవారం ముగిసింది. డైరెక్టర్ ప్రొఫెసర్ త్రిపుర సుందరి, డీన్ ప్రొఫెసర్ కాత్యాయిని మాట్లాడుతూ లింక్డ్ ఇన్ కెరీర్ కిక్ స్టార్టర్ ప్రోగ్రాం విద్యార్థినులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థినులకు కెరీర్ గైడెన్స్ ఇచ్చేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని పాల్గొన్నారు.

స్నాక్స్ ఖర్చు రూ. 37 లక్షలే..!

- అవినీతి ఆరోపణలు అవాస్తవం

తిరుపతి తుడా: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో గత మూడేళ్లుగా స్నాక్స్ ఖర్చుల కోసం మూడు కోట్లు వెచ్చించారని, దీనిపై విచారణ జరిపించాలని కొందరు కార్పొరేటర్లు సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్‌డేలో కమిషనర్ మౌర్యకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆమె వెంటనే విచారణకు ఆదేశించారు. మూడేళ్లలో స్నాక్స్ కోసం ఖర్చు చేసిన వివరాలను శుక్రవారం అధికారులు కమిషనర్‌కు అందించారు. మొత్తం మూడేళ్లలో రూ.37,68,178లు మాత్రమే ఖర్చు చేశారని అధికారులు పేర్కొన్నారు. కార్పొరేటర్లు చేసిన అవినీతి ఆరోపణలో వాస్తవం లేదని తేలింది.

500 నక్షత్ర తాబేళ్ల స్వాధీనం



తరలించడానికి సిద్ధంగా ఉంచిన నక్షత్ర తాబేళ్లు

తిరుపతి అర్బన్: తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లో 500 నక్షత్ర తాబేళ్లను శుక్రవారం చెన్నైకి తరలిస్తుండగా టవీశాఖాధికారులు స్వాధీనం చేసుకున్నారు. వాటిని మామండూరు అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు. అటవీ అధికారులు సుదర్శన్ రెడ్డి, రవీంద్ర, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



నగరంలోని 3వ డివిజన్ వద్ద టీటీడీ కళ్యాణ మండపాల సమీపంలో చెత్తదిబ్బ

ఖాళీ స్థలం.. వ్యర్థాల మయం

తిరుపతి స్మార్ట్ సిటీ.. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ర్యాంకుల మీద ర్యాంకులు సాధించింది. అయితే క్షేత్రస్థాయిలో పేరు గొప్ప ఊరు దిబ్బలా మారింది పరిస్థితి. కార్పొరేషన్ అధికారుల అలసత్వం.. పారిశుద్ధ్యంపై పలువురు నగరవాసుల అవగాహలోపం.. కొందరు స్థల యజమానుల నిర్లక్ష్యం కారణంగా ప్రతిష్టాత్మక తిరుపతి అధ్వానంగా తయారైంది. ఆకాశాన్నంటే హర్మ్యాల మధ్య చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. ఖరీదైన ఇళ్ల నడుమ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. విషసర్పాలు.. కీటకాలకు ఆవాసాలుగా మారిపోతున్నాయి. రహదారులకు ఇరువైపులా పడేసిని చెత్తాచెదారాలు దుర్వాసన వెదజల్లుతున్నాయి.

- నివాసాల మధ్య పెరిగిన పొదలు
- విషపురుగులకు అవే ఆవాసాలు
- తిరుపతిలో 2వేలకు పైగా ఖాళీ ప్లాట్లు
- డంపింగ్ యార్డులను తలపిస్తున్న జాగాలు
- పట్టించుకోని కార్పొరేషన్ అధికారులు

తిరుపతి తుడా : తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఖాళీ స్థలాలు వ్యర్థాలకు ఆవాసాలుగా మారాయి. చెత్త చెదారం, ఇతర వ్యర్థాలతో ఖాళీ స్థలాలు డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. స్థల యజమానులు పట్టించుకోకపోవడంవతో ఆయా జాగాల్లో ముళ్లపొదలు పెరిగి చిట్టడివిని తలపిస్తున్నాయి. చుట్టు పక్కల నివాసం ఉంటున్న ప్రజలకు ఇబ్బందికరంగా మారుతున్నాయి. దోమలతోపాటు విషపురుగులతో సహవాసం చేయాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. అలానే భవన వ్యర్థాలను ఇష్టారాజ్యంగా ఎక్కడపడితే అక్కడ పారబోస్తున్నారు. దీంతో రోడ్లు కళావిహీనంగా, వ్యర్థాలకు అడ్డాగా మారిపోయాయి.

జనం ఇబ్బందులు

తిరుపతి నగరంలో సుమారు 90 వేలకు పైగా నివాసాలు ఉన్నాయి. అలగే ఇళ్ల మధ్య సుమారు 2వేలకు పైగా ఖాళీ స్థలాలు(ప్లాట్స్) ఉన్నట్లు గుర్తించారు. భవన నిర్మాణాలు చేపట్టకుండా ఖాళీ స్థలాలపై సంబంధిత యజమానులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రహరీ గోడ నిర్మించుకోకపోవడం వల్ల చుట్టుపక్క ప్రజలు చెత్త చెదారంతోపాటు గృహోపకరణ వ్యర్థాలను ఈ ఖాళీ స్థలాల్లో పడేస్తున్నారు. ఇందులో మురుగునీరు చేరడంతో పాటు ముళ్ల పొదలు పెరుగుతున్నాయి. దీంతో ఇలాంటి స్థలాలు విషపురుగులకు ఆవాసాలుగా మారిపోయాయి. ప్రజలపై దోమలు దండయాత్ర చేయడానికి ఇలాంటి వ్యర్థాలతో నిండిన స్థలాలే కారణంగా గుర్తించారు. మురుగు కూపాల్లో దోమలు విష కీటకాలు విపరీతంగా వృద్ధి చెందుతున్నాయి. వీటి కారణంగా నగర ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పాలవుతున్నారు. సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు.



లక్ష్మీనగర్ సర్కిల్ వద్ద చిట్టడవిని తలపిస్తూ..



2వ డివిజన్ ఆటోనగర్ వద్ద..

అధ్వానంగా రహదారులు

తిరుపతి నగరంలో పలు రోడ్లను కార్పొరేషన్ అభివృద్ధి చేసింది. పచ్చని మొక్కలతో పాటు విద్యుద్దీపాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. అయితే అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ రహదారులు ఇప్పుడు అధ్వానంగా మారిపోయాయి. కొబ్బరి బొండాల చిప్పలు, కోడి, చేప, భవన వ్యర్థాలతో నగరంలోని ప్రధాన రహదారులు డంపింగ్ యార్డ్‌లుగా మారిపోయాయి.

సీఅండ్‌డీ ప్రాజెక్టుకు చేరని చెత్త

పబ్లిక్ ప్రైవేటు పార్టనర్ షిప్ విధానంతో తూకివాకంలో ఓ కంపెనీ సీఅండ్‌డీ (బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్స్ అండ్ డెమోలిష్)భవన నిర్మాణ వ్యర్థాల నిర్వహణ ప్రాజెక్టును నెలకొల్పింది. సుమారు రూ. 7 కోట్ల వ్యయంతో 2019లో ఈ ప్రాజెక్టును స్థాపించారు. తిరుపతి నగరంలో వెలువడే భవన వ్యర్థాలను సీఅండ్‌డీ ప్రాజెక్టుకు తరలించాలి. ఇందుకు భవన యజమాని టన్ను వ్యర్థానికి రూ. 650 లెక్కన కార్పొరేషన్‌కు చెల్లించాలి. ఈ నిబంధన ఇప్పుడు అమలు కాకపోవడంతో ప్రాజెక్టు అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది.అవసరమైన భవన వ్యర్థాలు తూకివాకంలోని ఈ ప్రాజెక్టుకు చేర్చడంలో అధికారులు విఫలమయ్యారు. దీంతో భవన వ్యర్థాలన్నీ నగరంలోని ఖాళీ స్థలాలు రోడ్ల పాలవుతున్నాయి. నగరంలోని ట్రాక్టర్లు, టిప్పర్ల యజమానులతో సమావేశమై భవన వ్యర్థాలను ఎక్కడైనా పారబోస్తే చర్యలు తప్పవని హెచ్చరిస్తే గాని వ్యవహారం ముందుకు సాగేలా కనిపించడం లేదు. అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పట్టించుకోని అధికారులు

నగరంలోని ఖాళీ స్థలాలను గుర్తించి సంబంధిత యజమానులకు రెవెన్యూ శాఖ నోటీసులు జారీ చేయాలి. ఆ స్థలాలకు వేకెంట్ ల్యాండ్ టాక్స్ విధించాలి. వీఎల్‌టీ కట్టించుకోవడం వల్ల యజమానుల్లో బాధ్యత పెరగడంతో పాటు కార్పొరేషన్‌కు రెవెన్యూ సమకూరుతుంది. అయితే అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారు. ఖాళీ స్థలాలలో వ్యర్థాలు ముళ్లపొదలు లేకుండా నోటీసులు జారీ చేయాల్సిన బాధ్యత టౌన్ ప్లానింగ్ అధికారులపై ఉంది. ఖాళీ ప్లాట్స్‌లో ముళ్లపొదలు పెరిగినా, వ్యర్థాలతో నిండి ఉన్నా స్థల యజమానులకు నోటీసులు జారీ చేసి పరిశుభ్రంగా ఉంచుకునేలా టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు చేపట్టాలి. అప్పటికీ స్థల యజమానులు స్పందించకుంటే అధికారులే సిబ్బందిరతో శుభ్రపరిచి, అందుకు చేసిన ఖర్చు మొత్తాన్ని యజమానుల నుంచి రాబట్టాల్సి ఉంది. ఇలా చేయడం వల్ల నగర పరిశుభ్రతకు పెద్ద పీట వేయడంతో పాటు కార్పొరేషన్‌కు మరింత ఆదాయం సమకూరుతుంది.

ప్రతి శుక్రవారం డ్రై డే తప్పనిసరి



నగర పర్యటనలో కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా : ప్రతి శుక్రవారం డ్రై డే తప్పనిసరిగా అమలు చేయాలని కార్పొరేషన్ కమిషనర్ మౌర్య స్పష్టం చేశారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆమె హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్‌తో కలిసి నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ ప్రజలతో మాట్లాడారు. తడి,పొడి చెత్తను వేర్వేరుగా ఇవ్వాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ నగర పరిశుభ్రతకు ప్రతి ఒక్కరు కట్టుబడి ఉండాలని చెప్పారు. గొల్లవానిగుంటలో నిర్మిస్తున్న టర్ఫ్ పిచ్ క్రికెట్ స్టేడియం పనులను పరిశీలించారు.

పోస్టర్ల ఆవిష్కరణ

తిరుపతి కల్చరల్: స్థానిక బైరాగిపట్టెడలోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఏఐటీయూసీ జాతీయ సమితి సమ్మేళనం పోస్టర్లను ు ఆవిష్కరించారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, రాధాకృష్ణ మాట్లాడుతూ, విశాఖలో శనివారం నిర్వహించే ఏఐటీయూసీ జాతీయ సమితి సమ్మేళనానికి కార్మికులందరూ తరలిరావాలని కోరారు.

తిరుమలలో విస్తృతంగా తనిఖీలు

తిరుమల: తిరుమలలోని పలు ప్రాంతాల్లో టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో గౌతమి విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. అన్నమయ్య భవనంలోని హోటల్, పీఏసీ–2, మాధవ నిలయాన్ని సందర్శించారు. నిర్మాణంలో ఉన్న కొత్త పీఏసీ–5ని కూడా పరిశీలించారు. అంతకుముందు ఎస్వీ మ్యూజియం పనుల పురోగతిని పర్యవేక్షించారు. పాంచజన్యం వసతి గృహం వద్ద నూతన వంటశాల, బయట ఉన్న ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, అక్షయ కిచెన్‌లను ఈఓ తనిఖీ చేశారు.

రైల్వేస్టేషన్‌లో పోలీసుల తనిఖీ

చంద్రగిరి : నరసింగాపురం రైల్వేస్టేషన్‌లో చంద్రగిరి పోలీసులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. ప్లాట్‌ఫామ్‌తోపాటు స్టేషన్ పరిసరాల్లోని అపరిచితులను ప్రశ్నించారు. ఎస్‌ఐ అనిత మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు రైల్వేస్టేషన్‌లో సాధారణ తనిఖీలను నిర్వహించినట్లు తెలిపారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. రైల్వేస్టేషన్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పదంగా కనిపించిన వారిని సైతం విచారించినట్లు వెల్లడించారు. ఈ క్రమంలోనే తనిఖీలను నిత్యం చేపట్టనున్నట్లు వివరించారు.

పాకాల రైల్వే స్టేషన్‌లో..

పాకాల : స్థానిక రైల్వే స్టేషన్‌లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఎస్‌ఐ మహేష్‌బాబు మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలకు చెక్ పెట్టేందుకే తనిఖీలు నిర్వహించామన్నారు. ప్రజలు సామాజిక స్ఫృహతో ఉండాలని, చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడేవారి సమాచారాన్ని వెంటనే పోలీసులకు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐ లోకేష్‌కుమార్ పాల్గొన్నారు.

సకాలంలో లక్ష్యాన్ని సాధించాలి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి సిటీ: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇళ్ల ఇవ్వాలనే సంకల్పంతో ఉందని, ఆ దిశగా వంద రోజుల లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారుతో సమావేశం నిర్వహించారు.. ఆయన మాట్లాడుతూ రోజువారీగా 36,618 స్టేజి కన్వర్షన్ల పురోగతి ఉండేలా సమీక్షించుకోవాలన్నారు. ఈఈలు, డీఈలు, ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలని కోరారు. ప్రతి వారం గృహ నిర్మాణ శాఖపై సమీక్షిస్తామని తెలిపారు. అధికారులు అలసత్వం వహిస్తే ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు.

త్వరలోనే ఏఈఈల నియామకం

– టీటీడీ ఈఓ శ్యామలరావు

తిరుమల : తిరుమల అన్నమయ్య భవన్‌లో శుక్రవారం చేపట్టిన డయల్ యువర్ ఈఓ కార్యక్రమంలో టీటీడీ ఈఓ శ్యామలరావు పాల్గొన్నారు. పలువురు భక్తుల సందేహాలను నివృత్తి చేశారు. ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా తిరుపతికి చెందిన దేవానంద్ అనే భక్తుడు మాట్లాడుతూ టీటీడీలో ఏఈఈ పోస్టుల భర్తీకి 9 నెలల క్రితం నోటిఫికేషన్ ఇచ్చారని, ఇప్పటివరకు రాత పరీక్ష నిర్వహించలేదని ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఈఓ త్వరలోనే ఏఈఈల నియామకం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ క్రమంలోనే మరిన్ని ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు.

- **వెంకటేశ్వర్లు, హైదరాబాద్ :** శ్రీవారి ఆలయంలో తోపులాట అధికంగా ఉంది. మహిళలు, పిల్లలు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు.
- **ఈఓ :** తోపులాట నివారణకు టీటీడీ విజిలెన్స్ విభాగం, అధికారులు సమన్వయంతో చర్యలు చేపడతాం.
- **పూర్ణ చంద్రశేఖర్, మచిలీపట్నం :** శ్రీవారిని దూరం నుంచి దర్శించుకోవాల్సి వస్తోంది. కంటి చూపు ఆనక మాలాంటి వృద్ధులు అసంతృప్తిగా వెనుదిరగాల్సి వస్తోంది.
- **ఈఓ :** భక్తుల రద్దీ అధికంగా ఉండడంతో దగ్గరగా దర్శనం కల్పించడం వీలు కావడం లేదు.
- **లక్ష్మణ్, చిలకలూరిపేట :** తిరుమలలోని వసతి గదుల్లో ఎలుకలు ఉన్నాయి. మేము తెచ్చుకున్న శ్రీవారి ప్రసాదాలను తినేస్తున్నాయి.
- **ఈఓ :** మీరు వెంటనే టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలి. త్వరలోనే తనిఖీలు చేసి సమస్య పరిష్కరిస్తాం.
- **అరుంధతి, హైదరాబాద్ :** ఆన్‌లైన్‌లో సుప్రభాత సేవ టికెట్ దొరికింది. కానీ నేను నడవలేని పరిస్థితి. శ్రీవారి దర్శనం కల్పించండి.
- **ఈఓ :** బయోమెట్రిక్ ద్వారా మీకు శ్రీవారి దర్శనం కల్పిస్తాం.
- **రాజేష్, తెలంగాణ :** శ్రీవారి దర్శనానికి తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలు తీసుకోవడం లేదు.
- **ఈఓ :** ఏపీ నుంచి వచ్చిన సిఫార్సు లేఖలను మాత్రమే అనుమతిస్తున్నాం.

తల్లిపాలే బిడ్డకు మేలు



ర్యాలీ నిర్వహిస్తున్న వర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులు


తిరుపతి సిటీ : పద్మావతి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల నుంచి ఉప్పరపల్లె రోడ్డువరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ టి.నారాయణమ్మ మాట్లాడుతూ బిడ్డకు తల్లిపాలే మేలని తెలిపారు. పోషక విలువలు మెండుగా ఉండే అమ్మపాల విశిష్టతను తెలియజేసేందుకే ర్యాలీ చేపట్టామని వెల్లడించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ భద్రమణి, అధ్యాపకులు నాగమణి, శ్రీవాణి, చెంచులక్ష్మీ, వాణి ప్రశాంతి, ఉమారాణి పాల్గొన్నారు.

తిరుపతి రూరల్ : తల్లి పాలతో బిడ్డకు మెరుగైన ఆరోగ్య రక్షణ లభిస్తుందని ఐసీడీయస్ సీడీపీఓ ప్రదీప తెలిపారు. తిరుపతి రూరల్ మండలంలోని పలు పంచాయతీల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఓటేరులో జరిగిన ర్యాలీలో ఆమె మాట్లాడుతూ తల్లి పాల వల్ల కలిగే ఉపయోగాలను వివరించేందుకే ఏటా ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనితవాణి, స్కూల్ టీచర్ నిర్మల, దుర్గాభవానీ పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేష్టం

రామచంద్రాపురం : తల్లిపాలే బిడ్డకు శ్రేష్టమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేవతి తెలిపారు. శుక్రవారం మండలంలోని బలిజపల్లె తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. అందులో భాగంగా బాలింతలకు, గర్భిణిలకు తల్లిపాల విశిష్టతపై అవగాహన కలిప్తస్తూ ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అమ్మపాలు తాగించడం వల్ల బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెంపొందుతుందని వెల్లడించారు. ఈ క్రమంలోనే బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలను వివరించారు.

ఏపీలో ప్రకృతి వ్యవసాయం భేష్!




వ్యవసాయ క్షేత్రంలో తమిళనాడు ప్రతినిధుల బృందం

తిరుపతి రూరల్ : ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి వ్యవసాయ విధానాలు భేషుగ్గా ఉన్నాయని తమిళనాడుకు చెందిన విశ్రాంత ఐఏఎస్ అధికారి సంతశీల నాయర్ కొనియాడారు. శుక్రవారం తిరుపతి రూరల్ మండలం వేమూరు గ్రామంలో ఆదర్శరైతు అయ్యప్పనాయుడు ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని తమిళనాడు ప్రతినిధుల బృందం సందర్శించింది. ఈసందర్భంగా పంచగవ్య, దశపర్ని, అగ్ని అస్త్రం, బ్రహ్మాస్త్రం, చేప ద్రావణం, పుల్లజెముడు కషాయాల తయారీని పరిశీలించారు. వాటి ఉపయోగాలను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ విధానాలు, వాటికి ప్రభుత్వాల ప్రోత్సాహంపై ఆరా తీశారు. రైతు అయ్యప్పనాయుడుని అభినందించారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు అధికారి షణ్ముగం, కృష్ణారావు, పట్టాభిరెడ్డి, రవిచంద్ర, గోకుల్, కార్తీక్, భాస్కర్, సెల్వరాజ్, కృష్ణామూర్తి, డేవిడ్ పాల్గొన్నారు.

ముగిసిన పవిత్రోత్సవాలు

తిరుపతి కల్చరల్ : శ్రీకోదండరామస్వామివారి ఆలయంలో మూడు రోజులుగా సాగుతున్న పవిత్రోత్సవాలు శుక్రవారం సాయంత్రం పూర్ణాహుతితో ఘనంగా ముగిశాయి. ముందుగా స్వామివారిని ఉదయం సుప్రభాతంతో మేల్కొలిపి తోమాల సేవ, సమప్రనామార్చన నిర్వహించారు. అనంతరం యాగశాలలో వైదిక కార్యక్రమాలు చేపట్టారు. సాయంత్రం తిరువీధి ఉత్సవం, భాష్యకార్ల గుడి వద్ద శాత్తుమొర జరిపించారు. యాగశాలలో వైదిక కార్యక్రమాలు, పూర్ణాహుతి, ఉత్సవమూర్తులను, ప్రధాన కుంభాన్ని సన్నిధికి వేంచేపు చేశారు. డిప్యూటీ ఈఓ నాగరత్న తదితరులు పాల్గొన్నారు.

'అపూర్వ'ం.. ఆత్మీయం



ఎస్వీ వైద్య కళాశాలలో పూర్వ విద్యార్థులు

తిరుపతి తుడా : ఎస్వీ వైద్య కళాశాల 1973–74 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు శుక్రవారం కలుసుకున్నారు. కళాశాల ఆవరణలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ విదేశాలలో స్థిరపడి వైద్యరంగంలో ఎన్నో మార్పులు చూసి, సేవలందించామన్నారు. తాము చదివిన కళాశాల, రుయా ఆస్పత్రిలో సందడి చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా రూ.15లక్షలతో ఫ్యాకల్టీ క్లబ్ ఏర్పాటు చేసి ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్‌కు అందించడం సంతృప్తినిచ్చిందని చెప్పారు. డిజిటల్ లైబ్రరీ ఏర్పాటుకు నోబెల్ ఆస్పత్రి అధినేత డాక్టర్ రవీంద్రనాథ్ సహాయ సహకారాలు అందిస్తానని చెప్పడం శుభపరిణామన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు డాక్టర్ కిరీటి, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ సునీత, డాక్టర్ సత్యనారాయణ మూర్తి, పీఆర్ఓ వీర కిరణ్ పాల్గొన్నారు.


నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చంద్రగిరి : సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా మండలంలోని పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ వాసురెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు.

4న ఛాంబర్ ఆఫ్ కామర్స్ క్రీడా సంబరాలు

తిరుపతి కల్చరల్ : తిరుపతి ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఈనెల 4వ తేదీన క్రీడా సంబరాలు నిర్వహించనున్నట్లు ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు మోహన్‌రాజు శుక్రవారం తెలిపారు. నిత్యం తమ లావాదేవీతో బిజీగా గడిపే వ్యాపారులకు మానసిక ఉల్లాసం కలిగించాలనే ఉద్దేశంతో ఈ సంబరాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 7 గంటలకు అవిలాల వద్ద ఓ ప్రైవేట్ క్రీడా కోర్టులో ఎస్పీ సుబ్బరాయుడు చేతుల మీదుగా సంబరాలు ప్రారంభమతాయని వెల్లడించారు. వ్యాపారులందరూ పాల్గొనాలని కోరారు.

క్వాంటమ్ కంప్యూటింగ్‌పై సదస్సు




జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

తిరుపతి సిటీ : స్థానిక కరకంబాడి రోడ్డులోని ఎస్వీసీఈ కళాశాలలో క్వాంటమ్ కంప్యూటింగ్, మార్ఫిక్ కంప్యూటింగ్ అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. కేంబ్రిడ్జ్ కన్సల్టెన్సీ సెంటర్, ఇండస్ట్రియల్ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ సిరిల్ ప్రసన్నకుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్వాంటమ్ కంప్యూటింగ్‌లో యువతకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. అనంతరం ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ నూతన సాంకేతిక అంశాలపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విభాగాధిపతి డి.శ్రీ.నివాసులురెడ్డి పాల్గొన్నారు.

ప్రశాంతం.. 'యాత్ర' పరిపూర్ణం



తిరుచానూరు రైల్వే స్టేషన్ వద్ద భోజనం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



మాట్లాడుతున్న చెవిరెడ్డి

తిరుపతి రూరల్ : చంద్రగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలసి దైవదర్శనానికి బయలుదేరిన మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి షిరిడీ యాత్ర శుక్రవారం విజయవంతంగా ముగిసింది. 2 వేల మందితో సాగిన ఈ యాత్ర ప్రశాంతంగా పరిపూర్ణమైంది. షిరిడీ యాత్రకు 24 బోగీలతో బయలుదేరిన ప్రత్యేక రైలులో చెవిరెడ్డి కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ప్రతి బోగీకి ఒక సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేశారు. అలాగే రైలులో ప్రయాణించే వారికి ఏ అవసరం వచ్చినా అందించడానికి సిబ్బందిని నియమించారు. రైలు తిరుచానూరు రైల్వే స్టేషన్‌కు రాగానే అక్కడ 2వేల మందికి భోజనం వసతి కల్పించారు. అందరూ సంతృప్తిగా భోజనం చేసిన తర్వాత 54 అద్దె బస్సుల్లో నేతలు, కార్యకర్తలను స్వగ్రామాలకు సాగనంపారు.